క్లుప్తంగా

కమిషనర్‌గా శివారెడ్డి తిరిగి బాధ్యతల స్వీకరణ


శివారెడ్డి

కావలి: కావలి మున్సిపాలిటీ కమిషనర్‌గా బి.శివారెడ్డి బుధవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఆరోగ్య ఇబ్బందుల దృష్ట్యా సుదీర్ఘ కాలం సెలవులో ఉన్న శివారెడ్డి తిరిగి విధులకు హాజరయ్యారు. కొత్తగా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరినారాయణన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వచ్చారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ నవీన్‌కుమార్

చేజర్ల: మండలంలోని మడపల్లి సచివాయంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను బుధవారం అందించారు. రోగుకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. గర్భిణులను పరీక్షించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఇంటింటికి తిరిగి మంచానికే పరిమితమైన వ్యాధిగ్రస్తులను, బాలింతను పరీక్షించారు. హైరిస్క్ గర్భిణులను, బాలింతను పరీక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్‌కుమార్, సిబ్బంది నర్సమ్మ, జి. మస్తానమ్మ, ఈ మస్తానయ్య, ఆశ వర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

కలిగిరిలో మోస్తరు వర్షం


కలిగిరిలో కురుస్తున్న వర్షం

కలిగిరి: కలిగిరిలో బుధవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. దీంతో వాతావారణం చల్లబడింది. వేసవితాపంతో ఇబ్బంది పడిన ప్రజలు సేదతీరారు.

బైక్ ఢీకొని చిన్నారికి గాయాలు

కావలిరూరల్: ఇంటి ముందు ఆడుకుంటున్న బాలికను ఓ ద్విచక్రవాహన చోదకుడు అతి వేగంగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో చిన్నారి తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన స్థానిక వాయినందన ప్రెస్ వీధిలో బుధవారం జరిగింది. 1వ పట్టణ పోలీసుల సమాచారం మేరకు వాయినందనప్రెస్ వీధికి చెందిన షేక్ షకీల, సుల్తాన్‌బాషా కుమార్తె సోఫియా ఇంటి బయట ఆడుకుంటుండగా ఈ ఘటన జరిగింది. వెంటనే పాపను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ఆత్మకూరు: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి పట్టణంలోని మూడు కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. ఉదయం తొలి సంవత్సరం ఇంటర్మీడియట్, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించినట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వాసుబాబు తెలిపారు. ప్రభుత్వ కళాశాల కేంద్రంలో 87 మందికి 7 మంది గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం పరీక్షకు 27 మందికి ముగ్గురు గైర్హాజరయ్యారన్నారు. షిరిడీ సాయిరామ్ కళాశాలలో ఉదయం జరిగిన పరీక్షకు 86 మందికి 8 మంది, మధ్యాహ్నం పరీక్షకు 16 మందికి ఇద్దరు గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ వివరించారు.

నేడు ఆధార్ ప్రత్యేక డ్రైవ్

వరికుంటపాడు: మండలంలోని తూర్పుబోయమడుగుల గ్రామ సచివాలయంలో గురువారం ఆధార్ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు డీడీఓ వెంకటేశ్వర్లు, కార్యదర్శి పుష్పలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు అప్‌డేట్, చేర్పులు, మార్పులు చేసుకోవచ్చన్నారు.

సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం

ఉదయగిరి: పట్టణంలోని చాకలివీధిలో సిమెంట్ రోడ్డు పనులను బుధవారం సర్పంచ్ పాములూరి సామ్రాజ్యం ప్రారంభించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సచివాలయానికి మంజూరైన రూ.20 లక్షల నిధుల్లో రూ.3 లక్షలు వెచ్చించి సిమెంటురోడ్డు నిర్మిస్తున్నట్లు ఆమె చెప్పారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. నాయకులు ఎస్దాని, ఎంపీ రియాజ్, ఉప్పుటూరి శ్రీనివాసులు, మజీద్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గుండుపల్లిలో ఉత్సవాలు

సీతారామపురం: మండలంలోని గుండుపల్లిలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు మూడు రోజుల పాటు కోదండరామస్వామి దేవస్థానంలో పదో వార్షిక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న గణపతిపూజ, సీతారాముల కల్యాణం, 27న అభిషేకాలు, పార్వేట, 28న పోలేరమ్మ తల్లికి పొంగళ్ల కార్యక్రమాలు ఉంటాయన్నారు. మండలంలోని పడమటి రొంపిదొడ్లలో బుధవారం సీతారాములు ఉత్సవాలు ప్రారంభించారు. గణపతి పూజ నిర్వహించారు. గురువారం సీతారాముల కల్యాణం, శుక్రవారం పార్వేట ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం


కావలి: వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి


వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం


పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి


వలంటీర్లకు వందనంలో ఎంపీపీ, ఎంపీడీఓ

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు చేరువ చేయడంలో వలంటీర్లు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. మండలంలోని వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సంక్షేమ సారథులుగా సేవలందిస్తున్న గ్రామ వలంటీర్లను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటైన తర్వాత పథకాల అమల్లోకి వచ్చిన కీలక మార్పులను వివరించారు. ప్రతి నెలా ఇంటి వద్దనే పింఛన్లు అందించడం దగ్గర నుంచి ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులను గుర్తించడం, సాంకేతిక సమస్యలతో పథకాలు అందని పేదలకు సమస్య పరిష్కారమయ్యేంత వరకు అండగా నిలవడంలో వలంటీర్లు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని తెలిపారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాయని వివరించారు. వలంటీర్లు ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవలు అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు

అల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రికలైన సంక్షేమ పథకాలు ప్రజలకు చేర్చడంలో వారధుల్లా పని చేస్తున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లుకు వందనం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వలంటీర్లను ఘనంగా సత్కరించారు. అనంతరం వలంటీర్లతో కలిసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, ఏఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, కమిషనర్ ఫణికుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ శ్రీదేవి, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్, ఉస్మాన్, కరుణాకర్ పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని డీసీపల్లి సచివాలయం పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లకు బుధవారం ప్రశంసా పత్రాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవితేజ, డీసీపల్లి సర్పంచ్ రేవూరు సుప్రజ మాట్లాడుతూ సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు తర్వాత ప్రజల సమస్యల పరిష్కారానికి వలంటీర్లు చేస్తున్న సేవలు కొనియాడారు. పంచాయతీ కార్యదర్శి అభినాష్, వీఆర్‌ఓ గౌస్‌బాషా, సచివాలయ అధికారులు అశోక్, నాగార్జున, వేణు, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారాలు

చేజర్ల: మండలంలోని పాతపాడు, పాడేరు, నాగులవెలటూరు, మైపాటివారికండ్రిక గ్రామాల సచివాలయాల్లో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. పలువురు వలంటీర్ల సేవలను గుర్తించి వారిని సన్మానించారు. వావిలేరు సచివాలయ పరిధిలోని మైపాటివారికండ్రికలో వలంటీర్లను ఆ గ్రామ సర్పంచ్ మాతంగి పెంచలయ్య సన్మానించారు. నాయకులు మాలపాటి పెంచలరెడ్డి, కర్జా వెంకటేశ్వర్లురెడ్డి, పంచాయతీ కార్యదర్శి వై.సురేష్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమోఘం

ఉదయగిరి: సచివాలయ వ్యవస్థలో వలంటీర్ల సేవలు అమోఘమని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. ఆయన బుధవారం మండలంలోని వెంగళరావునగర్ సచివాలయ పరిధిలో వలంటీర్లకు సన్మానం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు నేరుగా ఇళ్లకే చేరుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఆర్.భారతి, ఎం.తిరుపతి, పంచాయతీ కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, దీనా, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం

వరికుంటపాడు: మండలంలోని తూర్పురొంపిదొడ్ల సచివాలయ వలంటీర్లకు బుధవారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఎంఈఓ షావుద్దీన్, గ్రామ ఉప సర్పంచ్ కె.నాగవేణి వలంటీర్లకు సేవామిత్ర, సేవా రత్న అవార్డులు అందించి శాలువాలతో సన్మానించి సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ వలంటీర్లు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. వలంటీర్లు బాధ్యతగా పని చేస్తుండాలన్నారు.

ప్రజల కోసమే వలంటీరు వ్యవస్థ

ఆత్మకూరురూరల్: ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు వారి సమస్యలు పరిష్కరించడానికే గ్రామ సచివాలయాలు, వలంటీరు వ్యవస్థ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామస్వామిపల్లిలో బుధవారం వలంటీర్లకు వందనం, గడప గడపకు మన ప్రభుత్వం సమీక్ష కార్యక్రమాలను నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆత్మకూరు మండలానికి ఐదు సేవా రత్న, 155 సేవా మిత్రా అవార్డులు ప్రభుత్వం మంజూరు చేసిందని వారంతా మరింత మెరుగైన పని తీరు కనబరచాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిషోర్, పంచాయతీ కార్యదర్శి కార్తీక్, వీఆర్‌ఓ రమణయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు సానా వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, గడ్డం శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


డీసీపల్లి సచివాలయంలో వలంటీర్లను సత్కరించిన సర్పంచ్ సుప్రజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవితేజ


మైపాటివారికండ్రికలో వలంటీర్లను సన్మానిస్తున్న సర్పంచ్, నాయకులు


వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీడీఓ తదితరులు

ప్రజల ముంగిటకే సంక్షేమ ఫలాలు


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల (సోమశిల): మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు ప్రజల ముంగిటకే చేరుస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బుధవారం కొత్తపల్లి సచివాలయ పరిధిలోని కచ్చిరిదేవరాయపల్లిలో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని, ఆయా పథకాలు మీకు అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. కచ్చిరిదేవరాయపల్లిలో స్థానికులు ఇళ్లు కట్టించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడి తప్పకుండా చేయిస్తానని హామీ ఇచ్చారు. కొత్తపల్లి సచివాలయ పరిధిలో సొంత స్థలంలో ఇళ్లు కట్టుకునే 37 మందికి ఎమ్మెల్యే పొజిషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొమ్మలేరు వాగుతో ఏటా కచ్చిరిదేవరాయల్లి, వెంగంనాయుడుపల్లి గ్రామ ప్రజలు వరదల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ప్రజల కష్టాలను గుర్తించి లోలెవల్ వంతెనను ఏర్పాటు చేసిందన్నారు. ఆ బ్రిడ్జిని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ ఓబులమ్మ, ఎంపీటీసీ సూరా వెంకటసుబ్బమ్మ, కచ్చిరిదేవరాయపల్లి సర్పంచ్ పోతుల సునీత, నాయకులు బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి, ఈశ్వరయ్య, చిలాకా కృష్ణారెడ్డి, నారసింహారెడ్డి, నర్సింహులు, బొమ్మవరం సర్పంచ్ కే లక్ష్మీదేవి, తహసీల్దార్ రమణరావు, ఎంపీడీఓ ఏ మధుసూదనరావు, ఎంఈఓ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం ప్రాధాన్యం


విద్యార్థినులను అభినందిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

చేజర్ల (సోమశిల): విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. అనంతసాగరం మండలం కొత్తపల్లిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు, ప్రోత్సాహకాలను ఆయన అందించారు. ఎం.వరలక్ష్మి, ఏ వర్ష, జ్యోతి, మానస, ప్రశాంతి, నాగేశ్వరిలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తన సోదరుడు దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పుట్టిన రోజున మండలంలో అధిక మార్కులు సాధించిన వారికి బహుమతులు అందజేస్తానని తెలిపారు. అనంతరం కొత్తపల్లి సచివాలయ పరిధిలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు ప్రజలకు సేవలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. సంక్షేమ పథకాలను చేరవేయడంలో ఎనలేని సేవలు చేస్తున్నారన్నారు. సేవా రత్న,సేవా మిత్ర వాలంటీర్లను అభినందించారు. దాతలు కాకూరు సుధాకర్‌రెడ్డి, కే శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ సంపూర్ణమ్మ, ఎంఈఓ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ మధుసూదనరావు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మేకపాటితోనే వైఎస్సార్‌సీపీ పటిష్టం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వింజమూరు (ఉదయగిరి): మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోనే ఉదయగిరిలో వైఎస్సార్‌సీపీ పటిష్టంగా ఉందని, వింజమూరు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. వింజమూరు ఆర్‌అండ్‌బీ బంగ్లాలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుల విలేకరుల సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఉదయగిరి ప్రాంతంలో నాలుగు దశాబ్దాలుగా రాజకీయాలకు వన్నె తెచ్చారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోసం, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆయన రెండు సార్లు లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశారన్నారు. ఆయన త్యాగం చిరస్మరణీయమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోసం రాజమోహన్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి పని చేశారన్నారు. భవిష్యత్‌లో కూడా రాజమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోనే పార్టీ పటిష్టంగా ఉంటుందన్నారు. 2024 ఎన్నికల్లో ఆయన నాయకత్వంలో భారీ మెజారిటీతో ఉదయగిరిని గెలిపిస్తామన్నారు. అధిష్టానం, ముఖ్యమంత్రి ఈ విషయాలను దృష్టిలో ఉంచుకోవాలని ఆయన కోరారు. మాజీ మండల కన్వీనరు గువ్వల కృష్ణారెడ్డి, మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ మద్దూరు చెన్నకృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, సర్పంచ్‌లు ఎస్.సుజన, రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ రొడ్డా కొండయ్య, మాజీ సొసైటీ డైరెక్టర్ కొండపల్లి రమేష్, భోజనపు గోపి, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌తో గట్టి నిర్మాణాలు


ప్రమాద బీమా పత్రాలను అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

సంగం: భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో ధృడమైన కట్టడాలను నిర్మించవచ్చునని సంస్థ టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం సంగం భారతి సిమెంట్ ట్రేడర్స్ రాజపూటి రమేష్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ అత్యాధునిక టెక్నాలజీతో తయారు చేసిందని, మార్కెట్‌లో దొరికే ఇతర సిమెంట్ల కన్నా తక్కువ సమయంలో సెట్టింగ్ పూర్తవుతుందని తెలిపారు. భారతి సిమెంట్ నాణ్యతపై వినియోగదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామని తెలిపారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ.లక్ష విలువ చేసే బీమా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సేల్స్ ఆఫీసర్ కె మణికుమార్ పాల్గొన్నారు.

మీ బిడ్డలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

- ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం


తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

వరికుంటపాడు: మీ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరుతూ బుధవారం మండలంలోని జడదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బోయమడుగులో 8వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల వివరాలు సేకరించి వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను కలిశారు. పిల్లలను జడదేవి ఉన్నత పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందని, ప్రాథమిక స్థాయి నుంచే ఆంగ్ల విద్యాబోధన జరుగుతోందన్నారు. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, ఎస్.దామోదర్, డి.బాలకృష్ణ, వెల్ఫేర్ సహాయకుడు బాలగంగులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కలకలం సుఖాంతం

కావలిరూరల్: కావలిలో బాలిక కిడ్నాప్ అంటూ వచ్చిన ప్రచారం అవాస్తవమని పెంచుకున్న తల్లే ఆ బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించినట్లు 1వ పట్టణ సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. కర్ణాటకకు చెందిన షేక్ అబ్దుల్‌సలాం తన భార్య, కుమార్తె హబీబాతో కలిసి బతుకుదెరువు కోసం ఒంగోలుకు వచ్చారు. రెండేళ్ల క్రితం అతని భార్య భర్త, బిడ్డను వదిలేసి కర్ణాటకకు వెళ్లిపోయింది. దీంతో అప్పటి నుంచి ఒంగోలులోని సుభాషిణి అనే మహిళ ఆ పాపను చేరదీసి పెంచుకుంటుంది. వీరితో పాటు అబ్దుల్ సలాం కూడా ఉండేవాడు. 9 నెలల క్రితం అతను కూడా పాపను వదిలేసి కావలికి వచ్చి ఓ హోటల్‌లో కుక్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అబ్దుల్ సలాం మంగళవారం ఒంగోలుకు వెళ్లి సుభాషిణికి తెలియకుండా తన కుమార్తెను తీసుకుని కావలికి వచ్చేశాడు. అయితే ఆ పాపకు చికున్‌ఫాక్స్ ఉండడంతో ఆందోళన చెందిన ఆందోళన చెందిన సుభాషిణి కావలికి వెతుక్కుంటూ వచ్చి ఆ పాపను తీసుకెళ్తుతుండగా అబ్దుల్ సలాం తన కుమార్తెను తనకే ఇవ్వాలని వారి కారు వెంట పడ్డారు. అయితే స్థానికులు పాపను కిడ్నాప్ చేశారని అపోహతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెంచుకున్న తల్లి సుభాషిణి, తండ్రి షేక్ అబ్దుల్ సలాంతో మాట్లాడి పాపను తండ్రితోనే పంపించారు. దీంతో ఈ కిడ్నాప్ కలకలానికి తెరపడింది.

క్రికెట్ పోటీలు ప్రారంభం

జలదంకి: మండలంలోని జమ్మలపాళెంలో బుధవారం జమ్మలపాళెం యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.21,116, ద్వితీయ బహుమతి రూ.11,116 ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. బెస్ట్ బ్యాట్స్ మెన్, బౌలర్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు నగదు బహుమతులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శివశంకర్, మల్లి, కార్తీక్, శ్రీహరి, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

కావలిరూరల్: పాలిటెక్నిక్ డిప్లామా కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ పాలిసెట్ కౌన్సెలింగ్ గురువారం నుంచే ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సుశీల్‌కుమార్ బుధవారం తెలిపారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు తమకు సమీపంలోని హెల్ప్‌లైన్ సెంటర్లలో హాజరు కావచ్చన్నారు. ఈ నెల 25 నుంచి జూన్ 1వ తేదీ వరకు https://appolycetnic.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ర్యాంకుల వారీగా ఈ నెల 28 నుంచి జూన్ 5వ తేదీ వరకు ఫిజికల్‌గా హాజరై తమ సర్టిఫికెట్లను సరిచూసుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్‌కు హాజరైయ్యే విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్లు జెరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు. జూన్ 1 నుంచి 6వ తేదీ వరకు ఆప్షన్లు నమోదు చేసుకోవాలని, 7న ఆప్షన్లు మార్పునకు అవకాశం ఉందన్నారు. జూన్ 9న సీట్లు కేటాయింపు ఉంటుందని తెలిపారు.

మాణిక్యరావు జయంతి వేడుకలు


చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపక సంఘం సభ్యులు

కావలి: జవహర్ భారతి కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు మాజీ ఎమ్మెల్సీ ఎయిడెడ్‌కు జీవం పోసిన ఎంజే మాణిక్యరావు జయంతి వేడుకలను కళాశాల అధ్యాపక సంఘం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎయిడెడ్ ఉద్యోగి ఆత్మగౌరవాన్ని, ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉన్నాడంటే దానికి మాణిక్య రావు సుదీర్ఘ పోరాట ఫలితమే అన్నారు. ఎయిడెడ్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ప్రభుత్వ అధ్యాపకులతో సమానంగా జీతభత్యాలను పొందుతున్నారంటే, ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్ పొందుతున్నారంటే అది ఆయన కృషే అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పి భాస్కర్‌రావు, సెక్రటరీ వెంకటరావు, కోశాధికారి విశాలాక్షి, సిబ్బంది మాల్యాద్రి సుబ్రహ్మణ్యం, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి


సూచనలిస్తున్న డీఎల్‌డీఓ కనకదుర్గాభవాని

అల్లూరు: జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులందరూ కృషి చేయాలని కావలి డీఎల్‌డీఓ కనకదుర్గాభవాని అన్నారు. బుధవారం అల్లూరు–2 సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడు త్వరగా ఇంటి నిర్మాణం చేపట్టి పూర్తి చేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణాల పురోగతిపై ఎప్పటికప్పుడు నమోదు చేసుకుంటూ సకాలంలో బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన మెటీరియల్ ఆలస్యం లేకుండా లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. లబ్ధిదారులు స్వయంగా నిర్మించుకున్నా లేక కాంట్రాక్టర్ ద్వారా నిర్మిస్తున్నా.. బిల్లులు మాత్రం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసి వారికి ఆర్థిక ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిగేందుకు ఆయా గ్రామాల్లో ఉండే నాయకులు కూడా లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ రంగ వరప్రసాద్, ఎంపీడీఓ శ్రీదేవి, కమిషనర్ ఫణికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాబోలుకు శ్రీరామజన్మభూమి ఉత్సవ విగ్రహాలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని చాబోలులో అయోధ్య నుంచి తెచ్చిన శ్రీరామజన్మభూమి ఉత్సవ విగ్రహాలను బుధవారం నుంచి ఊరేగించారు. గ్రామంలోని కోదండరామ, సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేత దేవాలయంలో జ్యోతి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి, తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి


దుకాణాల ముందు వస్తువులను తొలగించాలని చెబుతున్న ఎస్సై శివశంకర్

ఆత్మకూరు: పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి బీఎస్సార్ సెంటర్ వరకు నిత్యం నెలకొంటున్న ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్సై ఎం.శివశంకర్‌రావు తెలిపారు. సోమశిల రోడ్డు కూడలి వద్ద ట్రాఫిక్‌కు ఏర్పడే ఇబ్బందులను గుర్తించి దుకాణాల ఎదుట ఏర్పాటు చేసే బోర్డులు, సామగ్రిని తొలగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ బీమా ఆర్థిక సాయం అందజేత

అల్లూరు: మండలంలోని బీరంగుంటకు చెందిన మంద పెంచలయ్య వడదెబ్బ కారణంగా మరణించగా వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయం కింద రూ.10 వేల ఆర్థిక సాయాన్ని మృతుడి భార్య ఆదిలక్ష్మికి ఈఓపీఆర్డీ వీరేంద్ర బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే మిగిలిన ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హజరత్ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా సాయం

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ ఐదో వార్డుకు చెందిన ఇమ్మడిశెట్టి చిన్న మస్తానయ్య పక్షవాతంతో బాధపడుతూ ఇటీవల తీవ్ర గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఈ కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా తక్షణ సహాయంగా రూ.10 వేలు మంజూరైంది. వార్డు కౌన్సిలర్ షేక్ మహబూబ్‌బాషా, సచివాలయ సిబ్బందితో కలిసి బాధిత కుటుంబానికి నగదు సహాయాన్ని బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ ఉద్యోగి ప్రశాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పూసల వెంకట రమణయ్య, ఎం పెంచలయ్య పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

ఉదయగిరి: మండలంలోని ఆర్లపడియలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ప్రతిష్టా విగ్రహాలకు, ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు, వేదపండితులు నిర్వహించారు. హోమాలు, విగ్రహాలకు క్షీర, జల, పుష్పాదివాసాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాల్లో దంపతులు పాల్గొన్నారు.

మాలధారుల హనుమాన్ పాదయాత్ర


పాదయాత్రగా సాగుతున్న ఆంజనేయస్వామి మాలధారులు

సంగం: మండలంలోని అనుసూయనగర్‌కు చెందిన ఆంజనేయస్వామి మాలధారులు బుధవారం హనుమాన్ పాదయాత్ర చేపట్టారు. అనసూయనగర్ నుంచి తిరుమలపై ఉన్న జపాలి క్షేత్రం వరకు జై హనుమాన్ అంటూ పాదయాత్రగా బయలుదేరారు. గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట చేసినప్పటి నుంచి ఆంజనేయస్వామి మాలధారణలతో ప్రతి ఏడాది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని దర్శిస్తామని తెలిపారు.